క్లుప్తంగా

మురళీనగర్ రామాలయంలో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు

మురళీనగర్: అయోధ్య రామ మందిరంలో సోమవారం నిర్వహించనున్న శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని మురళీనగర్ రామాలయంలో ఎల్ఈడీ స్క్రీన్‌లో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు రామాలయ కమిటీ కార్యదర్శి సనపల వరప్రసాద్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు లలితా భక్త మండలిచే రామ రక్షా స్తోత్రం, హనుమాన్ చాలీసా, 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహిస్తామని చెప్పారు. శ్రీరామనామ భజన కాలక్షేపం అనంతరం మంగళహారతి ప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సీతారాముల విగ్రహ ప్రతిష్ఠను వీక్షించాలని ఆయన కోరారు.

నేడు అనువాద నవల ఆవిష్కరణ

సీతంపేట: నవలా రచయిత ఎస్.డి.వి.అజీజ్(కర్నూలు) రచించిన 'అల్లూరి సత్యనారాయణ రాజు' నవల హిందీ అనువాదం పుస్తకావిష్కరణ సభ శనివారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరగనుందని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.వి.ఎస్.శర్మ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆళ్వార్‌దాస్ వర్ధంతి నేడు

మురళీనగర్: వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, వాకర్స్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన సుంకర ఆళ్వార్‌దాస్ 21వ వర్ధంతిని వాకర్స్ పార్కులో శనివారం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం జరుగుతుందని వాకర్స్ అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ఎలక్ట్రీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే స్థాపించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నేక్) ద్వారా నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ అందజేస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకం కింద ఉచిత శిక్షణ, ఉపాధి నిమిత్తం నేరుగా అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దీనికి పది పాసైన వారు అర్హులని, ఈ శిక్షణ రెండు మాసాలు ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 8309059974 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

యూజీడీ లీకుతో అవస్థలు



దాడి రామ్మూర్తి కల్యాణ మండపం వద్ద లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని దాడి రామ్మూర్తి కల్యాణ మండపం వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగునీరు రోడ్డు ఎక్కి ప్రవహిస్తుండటంతో అటుగా వెళ్లే వాహన చోదకులు, పాదచారులు నెల రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కొండవాలుకు మంచి రోజులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో కొండవాలు ప్రాంతాలకు మంచి రోజులొచ్చాయి. కొండవాలులో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోంది. గత టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని కొండవాలు ప్రాంతాలపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.



- 47వ వార్డులో అభివృద్ధి పరుగులు
- మెట్ల మార్గాలు, డ్రైనేజీలు, బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం
- కొండవాలు ప్రాంతాల ప్రజల హర్షం



నాడు: సంజీవయ్య కాలనీలో అధ్వాన సీసీ రోడ్డు



నేడు: సంజీవయ్య కాలనీలో కొత్త సీసీ రోడ్డు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డులో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ముఖ్యంగా వార్డులోని కంచరపాలెం పరిధి కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. నివాసుల కోసం అనేక మౌలిక సదుపాయాల కల్పించారు. గతంలో ఇక్కడి కొండవాలు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి ఈ నాలుగున్నరేళ్లలో కొండవాలులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. నూతన మెట్ల మార్గాలు, బీటీ, సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు.

నిధులు.. పనులు

రాంజీ ఎస్టేట్ కొండవాలు ప్రాంతంలో రూ.15.39 లక్షలతో, పెదకొత్తూరులో రూ.24.52 లక్షలతో, సంజీవయ్య కాలనీలో రూ.23.98 లక్షలతో, కప్పరాడలో రూ.19.58 లక్షలతో, బాపూజీనగర్–1లో రూ.21.80 లక్షలతో, బాపూజీనగర్–2లో రూ.25.39 లక్షలతో, తిక్కవానిపాలెం కాలనీలో రూ.19.24 లక్షలతో, అల్లూరి సీతారామరాజు కాలనీలో రూ.22.55 లక్షలతో, ఇందిరానగర్‌లో రూ.13.50 లక్షలతో, అంబేద్కర్ ఎస్టేట్‌లో రూ.28.35 లక్షలతో, అరుంధతినగర్‌లో రూ.12.20 లక్షలతో, సురేష్‌రామ్‌నగర్‌లో రూ.10.50 లక్షలతో మెట్ల మార్గాలు, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు, గెడ్డలకు రక్షణ గోడల నిర్మాణం వంటి పనులు నిర్వహించారు. ఈ వార్డులో గత రెండేళ్లలోనే సుమారు రూ.2.37 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు నిర్వహించారు.



నాడు: రాంజీ ఎస్టేట్‌లో శిథిలావస్థలో మెట్ల దారి



నేడు: రాంజీ ఎస్టేట్‌లో నిర్మించిన మెట్ల మార్గం

ప్రజా ప్రతినిధుల కృషితో..

జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చొరవతో ఈ వార్డులో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి కౌన్సిల్‌లో నిధులు మంజూరు చేయించుకుని కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. రక్షణ గోడలు, సీసీ, బీటీ రోడ్లు, మెట్ల మార్గాలు, డ్రైనేజీలు, కాలువలను నిర్మింపజేస్తూ ప్రజల ఇబ్బందులను తొలగిస్తున్నారు. వార్డులో సమస్యలు పరిష్కరం కావడం, అభివృద్ధి పనులు మెరుగ్గా జరుగుతుండటంతో కొండవాలు నివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెదకొత్తూరులో నిర్మించిన బీటీ రోడ్డు

నివాసుల కష్టాలు తీరాయి



కొండవాలులో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్నాం. మౌలిక వసతుల జాడ ఏనాడు కనిపించలేదు. కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. జీవీఎంసీ నిధులు పుష్కలంగా మంజూరు కావడంతో మెట్ల మార్గాలు, రోడ్లు నిర్మిస్తున్నారు. కొండవాలు ప్రజలు ప్రశాంతంగా నడుస్తున్నారు.
– ఎస్.జయప్రకాశ్, రాంజీ ఎస్టేట్

మౌలిక సదుపాయాలు బాగున్నాయి



రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ కృషితో కొండవాలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయి. మెట్ల మార్గాలకు, రోడ్లకు మోక్షం లభించింది. అన్ని మౌలిక సదుపాయాలు కలిస్తూ వార్డును స్మార్ట్‌గా తీర్చిదిద్దుతున్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నాం.
– అన్నపూర్ణ, పెదకొత్తూరు

ప్రజల సహకారంతో అభివృద్ధి



వార్డులోని కొండవాలు ప్రాంతాలను ప్రజల సహకారంతో అభివృద్ధి చేస్తున్నాం. నివాసులకు మౌలిక వసతులు అందించాలన్న నా కృషికి రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ, ఎంపీ నిధులు మంజూరు కావడంతో వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాను.
– కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్, 47వ వార్డు

ఇంటింటా కుల గణన సర్వే



రామకృష్ణానగర్‌లో సర్వే చేస్తున్న హెల్త్ సెక్రటరీ తంబది, వలంటీర్ మాధవి



44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే ఉత్తర నియోజకవర్గంలో శుక్రవారం ప్రారంభమైంది. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు సంయుక్తంగా ఇంటింటికీ వెళ్లి గ్రామ సచివాలయ యాప్‌లో సర్వే వివరాలు నమోదు చేశారు. కుటుంబ సభ్యుల పేర్లు, వయసు, కులం, మతం, చదువు, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా, వాటర్ సోర్స్, పెంపుడు జంతువులు, కుకింగ్ టైప్, బాత్ రూమ్.. ఇలా సుమారు 15 రకాల వివరాలు యాప్‌లో నమోదు చేసి బెనిఫిషరీ థంబ్, సచివాలయ కార్యదర్శి, వలంటీర్ థంబ్‌తో జత పర్చి వివరాలు నమోదు చేశారు. లెవెల్ 2లో మిగితా కుటుంబ సభ్యులు వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తున్నారు. జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీ సచివాలయం పరిధిలోని రామకృష్ణానగర్‌లో హెల్త్ సెక్రటరీ తంబది, వలంటీర్ మాధవి కుల గణన సర్వే నిర్వహించారు. తమకు 50 ఇళ్ల సర్వేకు కేటాయించినట్టు వారు తెలిపారు.

44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో సచివాలయ సిబ్బంది సర్వే చేశారు.

'బీజేపీకి అన్ని మతాలపై గౌరవం'

సీతమ్మధార: బీజేపీ అన్ని మతాలను గౌరవిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశమంతా అయోధ్య రామ మందిర ప్రారంభ వేడుక చేసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని రాష్ట్రాలు పాఠశాలలకు సెలవులు ప్రకటించాయని, ఏపీలో కూడా సెలవు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు పరశురాంరాజు, సురేష్‌బాబు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వీరంగం

సీతమ్మధార: పూటుగా మద్యం తాగిన ఒక పాత నేరస్తుడు సమోసా బండి అద్దాలు పగలగొట్టిన సంఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా.. తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులో భార్యభర్తలు జగదీష్, విమల తోపుడు బండిపై సమోసాల దుకాణం నడుపుతున్నారు. రైల్వే న్యూకాలనీకి చెందిన పాత నేరస్తుడు షేక్ కాజా మోహిదిన్ శుక్రవారం రాత్రి 7.10 గంటల సమయంలో అక్కడికి వెళ్లి సమోసా కావాలని అడిగాడు. దుకాణదారుడు డబ్బులు ఇమ్మని అడగడంతో తాగిన మైకంలో ఉన్న కాజా తోపుడు బండి అద్దాలను పగలగొట్టి వీరంగం సృష్టించాడు. దీంతో విమల అతడిపై తిరగబడింది. స్థానికులు ఫోర్త్ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని కాజాను అదుపులోకి తీసుకున్నారు. దుకాణదారుడు జగదీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కాజాకు చేతి మీద గాయం కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై బాధితుడి భార్య విమల పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో షేక్ కాజాపై 324 సెక్షన్ కింద కేసు ఉంది. తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ చుట్టుపక్కల ప్రాంతాల్లో రౌడీయిజం చేస్తుంటాడని పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

అల్లిపురం: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలానికి చెందిన పోతల కొండబాబు జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో కలాసీగా పని చేస్తున్నాడు. అతను కుటుంబంతో కలిసి అల్లిపురంలోని బంగారమ్మమెట్టలో జీవిస్తున్నాడు. సంక్రాంతి పండగ సందర్భంగా కుటుంబంతో సొంత గ్రామమైన చీడికాడ వెళ్లి గురువారం సాయంత్రం తిరిగి వచ్చాడు. అనంతరం భార్య చెల్లయ్యమ్మతో గొడవ పడి మద్యం తాగి వచ్చాడు. రాత్రి కుటుంబం అంతా భోజనాలు చేసి నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారి 6 గంటల సమయంలో చెల్లయ్యమ్మ లేచి చూసే సరికి ఇంటి గ్రిల్ పైన రాడ్డుకు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఆమె చుట్టుపక్కల వారిని పిలిచింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య చెల్లయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక కృతజ్ఞతలు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులుకు కృతజ్ఞతలు తెలుపుతున్న పేడాడ రమణికుమారి

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా నియమితులైన అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు పేడాడ రమణికుమారి ఎండాడలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు కోలా గురువులును, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజులను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు ఉమా మహేశ్వరరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి పిలా ప్రేమ్‌కిరణ్, కంచరన గాయత్రి, వాసుపల్లి మసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

మద్దిపాలెం: ఆర్ అండ్ బీ వద్ద ఉన్న సీడీపీవో కార్యాలయం ఎదుట శుక్రవారం అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. తాము చెప్పిన వెంటనే విధుల్లో చేరితే అండగా ఉంటామని, లేకపోతే సమ్మె ముగిశాక మీ సంగతి చూస్తామంటూ అంగన్‌వాడీ పర్యవేక్షకులు పలువురు కార్యకర్తలకు, ఆయాలకు సూచిస్తున్నారని అంగన్‌వాడీలు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా నాయకులు పి.మణి, వై.తులసి సీడీపీవో కార్యాలయం వద్దకు వచ్చి సీడీపీవో, పర్యవేక్షకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ




క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం

వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు



సామాజిక సమతా సంకల్ప సభలో కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన సామాజిక సమతా సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సోషల్ జస్టిస్ అంటే ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుర్తుకు వచ్చేలా, దేశ చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోయేలా అత్యంత ఎత్తయిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని కొనియాడారు. భవిష్యత్తులో కులాలు, మతాల మధ్య తారతమ్యాలను రూపుమాపి సమ సమాజాన్ని స్థాపించి, వెనుకబడిన వర్గాలకు వారు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించి ప్రగతి పథంలో ముందుకు ప్రయాణించేలా జగనన్న చేశారన్నారు. ఉత్తర నియోజకవర్గం తరఫున సీఎంకు కె.కె.రాజు ధన్యవాదాలు తెలిపారు.



అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కె.కె.రాజు, పార్టీ నేతలు

సామాజిక న్యాయ సభలో కె.కె.రాజు

విజయవాడలో శుక్రవారం నిర్వహించిన సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజుతోపాటు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ వి.ప్రసాద్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, రాష్ట్ర విద్యార్థి విభాగం సెక్రటరీ జిలకర్ర నాగేంద్ర, కిరణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన 'ఉత్తర' నాయకులు

సీతమ్మధార: విజయవాడ స్వరాజ్ మైదానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతి వనం, 206 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు బస్సులో బయలుదేరి వెళ్లారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో శుక్రవారం తెల్లవారు జామున 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు జెండా ఊపి బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

జోరుగా డ్రెయిన్ నిర్మాణ పనులు



లలితానగర్‌లో నిర్మాణంలో ఉన్న డ్రెయిన్



లలితా పీఠం రోడ్‌లో నిర్మించిన డ్రెయిన్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లోని పలు రహదారుల్లో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. లలితా పీఠం రోడ్, దాని వెనుక రహదారుల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పాత డ్రెయిన్‌లు తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నారు. చాలా చోట్ల డ్రెయిన్లు శిథిలమవడంతో మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తుండటంతో స్థానికులు చాలా కాలంగా ఇబ్బంది పడుతున్నారు. కొత్త డ్రెయిన్ల నిర్మాణంతో సమస్య పరిష్కారమైందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు నిజాయితీ

మహిళకు మరచిపోయిన సెల్ అప్పగింత



రమణమ్మకు సెల్ అందిస్తున్న రైతు వెంకటరమణ

సీతమ్మధార: సీతమ్మధార సాయంత్రం రైతుబజార్‌లో ఒక మహిళ మరచిపోయిన సెల్‌ఫోన్‌ను ఆమెకు అప్పగించి ఓ రైతు తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాలిలా.. హెచ్‌బీ కాలనీ సింహాద్రిపురానికి చెందిన కె.రమణమ్మ అనే మహిళ శుక్రవారం సాయంత్రం సీతమ్మధార రైతుబజార్‌లో కూరగాయలు కొనుగోలు చేసి స్టాల్ వద్ద తన సెల్‌ఫోన్ మరిచిపోయి వెళ్లిపోయింది. ఆ మొబైల్‌ను గమనించిన తవ్వవానిపాలేనికి చెందిన రైతు బి.వెంకటరమణ వెంటనే ఈవో కార్యాలయంలో ఉన్న సహాయకుడు సతీష్‌కు అందజేశాడు. ఆ సమయంలో రమణమ్మ కాల్ చేయగా.. సెల్‌ఫోన్ తమ వద్ద ఉందని, కార్యాలయానికి వచ్చి తీసుకువెళ్లాలని సతీష్ కోరారు. ఆయన సమక్షంలో రమణమ్మకు రైతు వెంకటరమణ ఫోన్ అందజేశారు. ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు సాహితీ వెలుగు రేఖ వేమన

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఇతర నాయకులు

సీతమ్మధార: తెలుగు సాహితీ వెలుగు రేఖ వేమన అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆశీలమెట్టలోని వేమన సంక్షేమ సంఘంలో నిర్వహించిన యోగి వేమన జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచి చెడులను తెలియజేసిన మహా యోగి వేమన అన్నారు. ఈ కార్యక్రమంలో వేమన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, సలహాదారు డి.నారాయణరెడ్డి, అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి, జనరల్ సెక్రటరీ సత్తి రామకృష్ణారెడ్డి (గౌతమి), కోశాధికారి బాలరెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ తాతారెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యాంకుమార్‌రెడ్డి, బోర కుమార్ రెడ్డి, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, నీలాపు రమణారెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఏఈ ధర్మేందర్‌రెడ్డి, బైరెడ్డి పోతన్నరెడ్డి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

తిరిగి అధికారంలోకి వైఎస్సార్‌సీపీ..

2024 ఎన్నికల్లో 125 సీట్లతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. ఆశీలమెట్టలోని వేమన సంక్షేమ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీఎం జగన్ అనితరసాధ్యంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్ని పార్టీలు వచ్చినా, ఎంత మంది నాయకులు కలిసినా అధికారంలోకి వచ్చేది జగన్ ప్రభుత్వమే అన్నారు. విశాఖ జిల్లాకు చెందిన స్థానిక రెడ్లను బీసీ–ఎ౪లో చేర్చాలన్నారు. రెడ్డి సంఘానికి స్థలం కేటాయించాలని, బీచ్ రోడ్డులో యోగి వేమన విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.